నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి..

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
05-11-2025
పేజీలు: 02


# శివనామస్మరణతో మారుమోగుతున్న ఆలయాలు






తెలుగు రాష్ట్రాల్లో కార్తీకపౌర్ణమిని అంతటా ఘనంగా జరుపుకుంటున్నారు. శివాలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధనలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఉసిరి చెట్టు కింద దీపారాధన చేసి, అరటి డొప్పలలో దీపాలు వెలిగించి నదిలో వదులుతున్నారు. భక్తులు దానధర్మాలు, నదీ స్నానాలు చేస్తూ పుణ్యం సంపాదించుకుంటున్నారు. శ్రీశైలంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా మల్లన్న దర్శనానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుండే పాతాళగంగలో పుణ్య స్థానాలు ఆచరించి స్వామిఅమ్మవార్ల దర్శనార్థం క్యూలైన్లలో బారులు తీరారు. స్వామిఅమ్మవార్ల దర్శనానికి 4 గంటల సమయం, ప్రత్యేక దర్శాన్నికి 2 గంటల సమయం పడుతుంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా శైవక్షేత్రాలకు పోటెత్తిన భక్తులు.. ఆలయాల్లో దీపాలు వెలిగించి, పూజలు, అభిషేకాలు చేస్తున్నారు. వరంగల్ వేయిస్తంబాల దేవాలయం, కాళేశ్వర ముక్తీశ్వర ఆలయం, రామప్ప దేవాలయం, కురవి వీరభద్రస్వామి, పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి ఆలయాల్లో భక్తుల రద్దీ కొనసాగుతుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు జరుగుతున్నాయి. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని భక్తులతో శైవ క్షేత్రాలు కిటకిటలాడుతున్నాయి. శివనామస్మరణంతో శివాలయాలు మారుమోగుతున్నాయి. తెల్లవారుజాము నుండే అలయాలకు చేరుకొని కార్తీక దీపాలు వెలిగించి, భక్తులు ప్రత్యేక అభిషేకాలు చేస్తున్నారు.మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. శైవ క్షేత్రాలకు పోటెత్తిన భక్తులు.. బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయంలో స్వామివారి దర్శనానికి బారులు తీరారు. బీరంగూడ భ్రమరాంబ మల్లికార్జున స్వామి, ఝూరాసంగం కేతకి సంగమేశ్వర, సంగారెడ్డి సోమేశ్వర ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా భద్రాచలం వద్ద గోదావరి నదిలో భక్తుల పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్నారు. మణుగూరు సబ్ డివిజన్ వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులతో శివాలయాలు కిటకిటలాడుతున్నాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు కార్తీక దీపాలు వెలిగించి, పూజలు చేస్తున్నారు.



## పోలీస్ స్టేషన్ ముందు పెట్రోల్ పోసుకుని వ్యక్తి ఆత్మహత్య

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడగా పోలీసులు వ్యవహరించిన తీరుతో మనస్తాపానికి గురయ్యి ఆత్మహత్యకు పాల్పడినట్టు సమాచారం. హైదరాబాద్—మల్కాజ్‌గిరి పోలీస్ స్టేషన్ పరిధిలో సింగిరెడ్డి మీన్ రెడ్డి(32) అనే వ్యక్తిని డ్రంక్ అండ్ డ్రైవ్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు. ఈ నేపధ్యంలో పోలీసులు తనతో సరిగ్గా వ్యవహరించలేదని మనస్తాపంతో, కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఎదుట ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడిన మీన్ రెడ్డి. ఈ ఘటన అర్ధరాత్రి 2 గంటల సమయంలో జరిగినట్టు, డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 120 రీడింగ్ నమోదైనట్టు చెబుతున్న పోలీసులు.



## దైవ దర్శనానికి వెళ్లి వస్తుండగా ఘోర ప్రమాదం..

### ముగ్గురు తెలంగాణ వాసులు మృతి

వారంతా దైవ దర్శనానికి వెళ్ళారు.. అక్కడ దర్శనం అనంతరం కారులో ఇంటికి బయలుదేరారు.. ఈ క్రమంలోనే ఊహించని రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.. దీంతో కారులోని ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. కర్నాటకలో జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తెలంగాణవాసుల మృతి చెందారు.. ఈ ఘటన కర్ణాటకలోని హల్లిఖేడ్‌లో జరిగింది. వ్యాను, కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు తెలంగాణ వాసులు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మృతులు సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం జగన్నాథ్‌పూర్ గ్రామానికి చెందిన వారిగా గుర్తించారు. ఈ రోడ్డు ప్రమాదంలో నవీన్ (40), రాచప్ప (45), కాశీనాథ్ (60) అక్కడికక్కడే మరణించారు. వీరంతా గణగాపూర్ దత్తాత్రేయ ఆలయానికి వెళ్లారు. అక్కడ దర్శనం అనంతరం కారులో తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో కారు వ్యాన్ ముందు భాగం నుజ్జు నుజ్జయింది. సమచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.



## ట్రంప్‌నకు ఝలక్.. న్యూయార్క్ నగర మేయర్‌గా జొహ్రాన్ మమ్దానీ ఎన్నిక

అమెరికాలో మరో చరిత్ర ఆవిష్కృతమైంది. న్యూయార్క్ నగర మేయర్‌గా డెమాక్రెటిక్ పార్టీ నేత, భారత సంతతికి చెందిన జొహ్రాన్ మమ్దానీ ఎన్నికయ్యారు. జొహ్రాన్ ఎన్నికైతే నిధులు నిలిపివేస్తామన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికలను ఖాతరు చేయని న్యూయార్క్ ప్రజలు మమ్దానీకే పట్టం కట్టారు. నగర మేయర్‌గా ఎన్నికైన తొలి ముస్లింగా, తొలి దక్షిణాసియా సంతతి వ్యక్తిగా మమ్దానీ చరిత్ర సృష్టించారు. ఆఫ్రికాలో జన్మించిన మమ్దానీకి ప్రజలు నగర పగ్గాలు అందించడం ఈ ఎన్నికల్లో ఆవిష్కృతమైన మరో విశేషం. కేవలం 34 ఏళ్ల వయసులోనే జొహ్రాన్ మమ్దానీని మేయర్ పీఠాన్ని సొంతం చేసుకున్నారు. గత వందేళ్లల్లో అత్యంత పిన్న వయస్కుడైన మేయర్‌గా అరుదైన గుర్తింపు దక్కించుకున్నారు. అమెరికా వ్యాప్తంగా ఆధిపత్య పోకడలు వేళ్లూనుకుంటున్న వేళ డెమాక్రెటిక్ పార్టీకి ఈ విజయం కొత్త ఊపునిచ్చిందని విశ్లేషకులు కామెంట్ చేస్తున్నారు. తన విజయంపై మమ్దానీ ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేశారు. మేయర్ కార్యాలయం ఉన్న సిటీ హాల్ ట్రెయిన్ స్టేషన్ వీడియోను కూడా షేర్ చేశారు. తన గమ్యానికి చేరుకున్నట్టు వినూత్న శైలిలో తెలిపారు.

# బుల్లెట్‌కు బుల్లెట్‌తోనే సమాధానం ఇస్తాం



పాకిస్తాన్ ప్రాయోజిత ఉగ్రవాదులు భారత్‌పై కన్నెత్తి చూడొద్దని కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం హెచ్చరించారు. వారు మళ్లీ దాడి గురించి ఆలోచించినా "గోలీ కా జవాబ్ గోలీ సే దియా జాయేగా" (బుల్లెట్‌లకు బుల్లెట్లతోనే సమాధానం ఇస్తాం) అని స్పష్టం చేశారు. బీహార్ ప్రతిపాదిత రక్షణ కారిడార్‌లో తయారు చేసిన పేలుడు పదార్థాలను ఈ ఉగ్రవాదులపై ఉపయోగించనున్నట్లు ఆయన తెలిపారు. పాకిస్తాన్ నుండి వచ్చిన ఉగ్రవాదులు పహల్గామ్‌లో మన పౌరులపై దాడి చేశారు. వారు మన తల్లులు, సోదరీమణుల నుదిటి నుండి సిందూర్‌ను తుడిచిపెట్టారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 20 రోజుల్లో ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించడం ద్వారా దానికి ప్రతీకారం తీర్చుకున్నారు. భారత సైన్యం పాకిస్తాన్ భూభాగంలో ఉగ్రవాదులను తటస్థీకరించింది అని బీహార్‌లో జరిగిన ఎన్నికల ర్యాలీలో షా అన్నారు. ప్రధాని మోదీ బీహార్‌లో డిఫెన్స్ కారిడార్‌ను ఏర్పాటు చేస్తున్నారు. పాకిస్తాన్ ప్రాయోజిత ఉగ్రవాదులు తమ తప్పును పునరావృతం చేస్తే బుల్లెట్‌లకు బుల్లెట్లతోనే సమాధానం ఇస్తాం అని వార్నింగ్ ఇచ్చారు. ఉగ్రవాదులపై ఉపయోగించబోయే ఫిరంగులు 'బీహార్‌లో తయారు చేసినవే అని అమిత్ షా తెలిపారు. గత కాంగ్రెస్ పాలనకు భిన్నంగా మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం దేశ భద్రతకు కట్టుబడి ఉందని అన్నారు. బీహార్‌లో ఆర్జేడీ 15 ఏళ్ల పాలనలో సివాన్‌లో బీభత్సం సృష్టించిన గ్యాంగ్‌స్టర్ నుండి రాజకీయ నాయకుడిగా మారిన దివంగత మహ్మద్ షాబుద్దీన్‌ను ప్రశంసిస్తూ నినాదాలు చేశారనే ఆరోపణలపై ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన కుమారుడు తేజస్వి యాదవ్‌లపై షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. లాలూ, అతని పార్టీ 'షాహాబుద్దీన్ అమర్ రహే', 'జంగల్ రాజ్' కలలు కంటున్నాయి కానీ బీహార్ ప్రజలు వీటిని అనుమతించరు అని షా అన్నారు.

# విజన్ ఉంటేనే అభివృద్ధి



ముందుచూపు ఉంటేనే ఏ రంగంలోనైనా అభివృద్ధి సాధ్యమని, రేపటి తరం భవిష్యత్ కోసం సరైన వేదికలను సిద్ధం చేయాల్సిన బాధ్యత పాలకులు, నేటి తరం పారిశ్రామికవేత్తలపై ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. లండన్‌లో ప్రతిష్ఠాత్మక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐవోడీ) సంస్థ ఆయన సతీమణి భువనేశ్వరికి మంగళవారం రెండు అవార్డులు అందించింది. ఈ కార్యక్రమంలో చంద్రబాబు కీలక ప్రసంగం చేశారు. ఐవోడీ సంస్థ కార్పొరేట్ ప్రపంచానికి 35 ఏళ్లుగా సేవలందిస్తున్నందుకు అభినందనలు తెలిపారు. ప్రపంచంలో రకరకాల మార్పులు వస్తున్నాయని, దానికి అనుగుణంగా ప్రభుత్వాలు గానీ, సంస్థలు గానీ తమ ప్రణాళికల్లో మార్పు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు టెక్నాలజీ విసిరే సవాళ్లను ఎదుర్కొనేందుకు దూరదృష్టి, పక్కా ప్లానింగ్ ఉండాలని సూచించారు. '1990ల్లో ఐటీ రంగ భవిష్యత్‌పై సందేహాలున్నా.. ఉమ్మడి ఏపీ సీఎంగా బిల్‌గేట్స్‌ను ఆహ్వానించి హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్‌ను స్థాపించేందుకు చొరవ తీసుకున్నాను. ఇప్పుడు భారతీయులు ప్రత్యేకించి తెలుగువారు గ్లోబల్ ఐటీ రంగంలో కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ (ఏఐ) చాలా వేగంగా విస్తరిస్తోంది. భవిష్యత్ మొత్తం దాని చుట్టూనే తిరగనుంది. దీనికి అనుగుణంగా ఏపీలో విధానాలను, ప్రణాళికలను రూపొందించుకుంటున్నాం. గూగుల్ తన అతిపెద్ద ఏఐ కేంద్రాన్ని అమెరికా వెలుపల విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తోంది. ఇది రాష్ట్రంలో ఇన్నోవేషన్స్, రీసెర్చ్, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి అంశాల అభివృద్ధికి దోహద పడుతుంది' అని సీఎం చెప్పారు.



## హార్దిక్ పాండ్యా-మహియెకా శర్మ రొమాంటిక్ ఫొటో

స్టార్ క్రికెటర్, టీమ్ ఇండియా ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా ఇటీవలే తరచూ వార్తల్లో నిలుస్తోన్న విషయం తెలిసిందే. భార్య నటాషాతో విడాకుల అనంతరం హార్దిక్ మళ్లీ డేటింగ్‌లో ఉన్నారంటూ కొంతకాలంగా తెగ ప్రచారం జరుగుతోంది. మోడల్, నటి మహియెకా శర్మతో డేటింగ్‌లో ఉన్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్న విషయం తెలిసిందే. ఇటీవలే వీరిద్దరూ జంటగా ముంబై ఎయిర్‌పోర్ట్‌లో కెమెరాకు చిక్కారు. ఇప్పుడు తాజాగా మరోసారి ఈ జంట హెడ్‌లైన్స్‌లో నిలిచింది. హార్దిక్ పాండ్యా తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని ఫొటోలను షేర్ చేశారు. అందులో మహియెకాతో కలిసి పాండ్యా బీచ్‌లో చిల్ అవుతూ కనిపించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. ఈ రొమాంటిక్ ఫొటోలతో వీరిద్దరి బంధంపై నెట్టింట మరోసారి చర్చ మొదలైంది. వీరిద్దరూ డేటింగ్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలు నిజమే అంటూ నెటిజన్లు చెప్పుకుంటున్నారు.

## సీతమ్స్ కాలేజీలో దారుణం.. వారం వ్యవధిలో ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్య!



చిత్తూరులోని సీతమ్స్ ఇంజనీరింగ్ కాలేజీలో విషాదం చోటుచేసుకుంది. బీటెక్ సెకండ్ ఇయర్ విద్యార్థి రుద్ర కాలేజీ మూడవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. హాస్పిటల్‌కు తరలించేలోపే అతడు మృతి చెందాడు. అంతకుముందు, సరిగ్గా నాలుగు రోజుల క్రితం, ఇదే కాలేజీలో నందిని రెడ్డి అనే విద్యార్థిని రెండవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. ఆమె తమిళనాడులోని వేలూరు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది.



## మూడేళ్లుగా సినిమాలకు దూరం

తెలుగు, హిందీ సినీరంగాల్లో అందం, అభినయంతో ఆకట్టుకున్న తారలు చాలా మంది ఉన్నారు. కేవలం ఒక్క సినిమాతోనే ఓవర్ నైట్ స్టార్స్ అయిన హీరోయిన్స్ ఉన్నారు. అయితే ఫస్ట్ మూవీతో ఓ రేంజ్ క్రేజ్ వచ్చినప్పటికీ ఆ తర్వాత అవకాశాలు అంతగా రాని ముద్దగుమ్మలు ఉన్నారు. ఇప్పుడు మనం మాట్లాడుకుంటున్న హీరోయిన్ మాత్రం సరైన సక్సెస్ కోసం కొన్నాళ్లపాటు ఎదురుచూసింది. అయినా ఎలాంటి బ్రేక్ రాలేదు. దీంతో నెమ్మదిగా సినిమాలకు దూరమైపోయింది. ఆమె వెండితెరపై కనిపించి మూడేళ్లు అవుతుంది. కానీ ఇప్పటికీ ఏమాత్రం క్రేజ్ తగ్గలేదు. ఇప్పటికీ ఆమె సినిమాల కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అందం, అద్భుతమైన నటనతో మెప్పించినప్పటికీ.. ఈ అమ్మడుకు అదృష్టం కలిసి రాలేదు. గ్లామర్ షోలతో కుర్రకారుకు మెంటలెక్కించిన ఈ వయ్యారి ఎవరో తెలుసా.. ? సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ ఈ బ్యూటీకి రోజు రోజుకి ఫాలోవర్స్ పెరిగిపోతున్నారు.

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# అలియా హాట్ లుక్స్

అలియా భట్ లేడీ గూఢచారిగా నటించిన ఈ యాక్షన్ డ్రామాలో వామికా గబ్బి మరో ప్రధాన పాత్ర పోషించగా బాబీ డియోల్ విలన్ గా నటిస్తున్నాడు. పోస్ట్ పోన్ కు కారణం అధికారికంగా చెప్పలేదు కానీ గ్రాఫిక్స్ కు సంబంధించిన అవుట్ పుట్ అంత సంతృప్తికరంగా రాకపోవడంతో పాటు స్టోరీ పరంగా తలెత్తిన కొన్ని లోపాలు సరిచేయడానికి టైం అవసరం కావడంతో వాయిదా వేశారని ముంబై టాక్. ఇదంతా వార్ 2 ప్రభావమే అంటున్నారు. ఒకవేళ వార్ 2 కనక బ్లాక్ బస్టర్ అయ్యుంటే అల్ఫా చెప్పిన టైంకే వచ్చేది. పఠాన్ 2, టైగర్ వర్సెస్ పఠాన్ కు రంగం సిద్ధమయ్యేది. కానీ ఇప్పుడివన్నీ పెండింగ్ లో పడుతున్నాయి. సల్మాన్ ఖాన్, షారుఖ్ ఖాన్ లు సైతం ఈ కొనసాగింపుల పట్ల ఏమంత ఆసక్తిగా లేరట. ఎంతసేపూ ఒకే తరహా విలన్ ని పెట్టి కేవలం ఆర్టిస్టులను మార్చుకుంటూ కథలు చెబుతున్న విధానం క్రమంగా ఫేడ్ అవుట్ అవుతుందని గుర్తించారు కాబోలు. ఆదిత్య చోప్రా మాత్రం ఇప్పుడప్పుడే స్పై వరల్డ్ మీద ఆశలు వదులుకునేలా లేరట.





## నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే
# 4 వేల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తానని హామీ

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ 30 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించబోతోందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎస్పీఆర్ హిల్స్ నుండి హబీబ్ ఫాతిమా నగర్ వరకు జరిగిన రోడ్డు షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే 4 వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు.మాగంటి గోపీనాథ్ మరణించారని, ఆయన భార్యను ఇప్పుడు బరిలోకి దింపి గెలిపించాలని బీఆర్ఎస్ కోరుతోందని, అయితే గతంలో పీజేఆర్ మరణించినప్పుడు జరిగిన ఉప ఎన్నికల్లో కేసీఆర్ పోటీకి నిలబెట్టారని గుర్తు చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మరణిస్తే వచ్చే ప్రతి ఉప ఎన్నికలోనూ కేసీఆర్ అభ్యర్థిని నిలబెట్టారని విమర్శించారు. కేటీఆర్‌కు ఇన్ని వేల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. సొంత ఇంటి నుంచి తనను గెంటేశారని కవిత రాష్ట్రమంతా తిరుగుతూ తన గోడు వెళ్లబోసుకుంటున్నారని ముఖ్యమంత్రి అన్నారు. సొంత చెల్లికి న్యాయం చేయలేని కేటీఆర్ ప్రజలకు ఏం చేస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్కరికైనా రేషన్ కార్డు ఇచ్చారా అని నిలదీశారు. తాము అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 14,159 రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ గెలిస్తే ప్రస్తుతం అందుతున్న పథకాలు కూడా ఆగిపోతాయని హెచ్చరించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధం అని ఆరోపించారు. కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తే 48 గంటల్లో కేసీఆర్, కేటీఆర్‌లను జైలుకు పంపిస్తామని చెప్పారని, సీబీఐకి అప్పగించి మూడు నెలలైనా కేసు నమోదు చేయలేదని విమర్శించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఫార్ములా ఈ-రేసు కేసులో కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ అనుమతి కోరితే స్పందన లేదని అన్నారు.

జూబ్లీహిల్స్‌లో రేవంత్ ఆత్మవిశ్వాసం: "30,000 ఓట్ల మెజార్టీతో గెలుస్తాం!"

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సందర్భంలో రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు-ఆధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్, బీజేపీ-చురుకైన ప్రచారాన్ని నిర్వహిస్తున్నాయి. తాజాగా సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రెహమత్ నగర్ డివిజన్‌లో ఒక పెద్ద రోడ్‌షోకు హాజరయ్యారు. ఈ రోడ్‌షో ఎస్పీఆర్ హిల్స్ నుండి హబీబ్ ఫాతిమానగర్ వరకు సాగింది.ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్‌లో 30,000 ఓట్ల మెజార్టీతో గెలిచే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ బీజేపీకి విలీనం కావచ్చని జోస్యం చేశారు. అలాగే, ఫార్ములా రేసులో కేసీఆర్ అరెస్ట్ కోసం గవర్నర్ అనుమతి ఇవ్వడం లేదని స్పష్టం చేశారు.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, "జూబ్లీహిల్స్‌లో 30,000 ఓట్ల మెజార్టీతో గెలుస్తాం. బీఆర్ఎస్ వారు ఓట్ల కోసం ఏమని అడుగుతున్నారు..? పీజేఆర్ మరణించినప్పుడు ప్రత్యర్థిగా ఉన్న చంద్రబాబు మద్దతు ఇచ్చారు. కానీ కేసీఆర్ అభ్యర్థిని నిలబెట్టి ఏకగ్రీవం కాకుండా అడ్డుకున్నారు. సొంత ఇంటి నుండి తప్పు చేస్తే న్యాయం రాదు, కేటీఆర్ చేయగలరా?" అని అన్నారు.అంతేకాక, కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో జరిగిన రూ. 50 కోట్ల అవినీతి కేసును సీబీఐ ద్వారా వెంటనే విచారించాలని, ఈ నెల 11 లోగా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సీఎం రేవంత్ డిమాండ్ చేశారు. లేదంటే, జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో బీఆర్ఎస్ బీజేపీ మద్దతు పొందుతున్నట్లు అవుతుంది అని అన్నారు.రేవంత్ రెడ్డి బీజేపీ-బీఆర్ఎస్ విలీనంపై కూడా సంకేతాలు ఇచ్చారు. "ఇది లోపాయికారి ఒప్పందం కాదా? జట్టు ఢిల్లీకి చేరగానే మొత్తం పరిస్థితి కమలంగా మారుతుంది," అని అన్నారు.

## స్టేజీ పైనే కన్నీళ్లు పెట్టిన..
# మంచు మనోజ్ భార్య మౌనిక



కొత్త జంట అఖిల్, తేజస్విని హీరోహీరోయిన్లుగా నటించిన నూతన చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. విరాటపర్వం, నీది నాది ఒకే కథ వంటి సెన్సిబుల్ చిత్రాల డైరెక్టర్ వేణు ఉడుగల ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్‌తో కలిసి ఈ సినిమా నిర్మాతగా వ్యవహరించారు. సాయిలు కంపాటి దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్నిప్రముఖ నిర్మాతలు బన్నీ వాసు, నందిపాటి వంశీ నవంబర్ 21న థియేటర్లలో విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రమోషన్ కార్యక్రమాలు వేగవంతం చేశారు. ఈక్రమంలో తాజాగా మంగళవారం ఈ సినిమా నుంచి.. 'రాంబాయి నీ మీద నాకు మనసాయెనే' అంటూ సాగే రొమాంటిక్ మెలోడీ పాటను ఆవిష్కరించారు. ఈ వేడుకకు మంచు మనోజ్ తన సతీమణి మౌనికతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన ప్రేమ కథను గుర్తు చేసుకుని భావోద్వేగానికి గురయ్యారు. ఈ ప్రపంచంలో తారతమ్యాలు లేనిది ప్రేమ ఒక్కటే. ప్రేమ పుడితే అంతే. 'రాంబాయి నీ మీద నాకు' పాటలోని 'రాజ్యమేదీ లేదుగానీ రాణిలాగా చూసుకుంటా' అనే లైన్ నాకు చాలా దగ్గరగా అనిపించింది. నేను మౌనికాకు కూడా అదే మాట చెప్పా..'నాకేమీ రాజ్యాలు లేవు, సినిమాలు కూడా తాత్కాలికంగా చేయట్లేదు. కానీ మళ్లీ నటిస్తా.. కష్టపడతా.. జీవితాంతం నిన్ను బాగా చూసుకుంటా.. నన్ను నమ్ముతావా జీవితాంతం నిన్ను రాణిలా చూసుకుంటా' అని. ఆమె నన్ను నమ్మింది నాతో వచ్చింది. ఎవరైనా మన మీద నమ్మకం ఉంచిన వారి చేయి ఎప్పుడూ వదలకండి" అని మనోజ్ చెప్పారు.




# నారా భువనేశ్వరికి 2 అంతర్జాతీయ అవార్డులు

ఏపీ సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి రెండు అంతర్జాతీయ అవార్డులను అందుకున్నారు. లండన్‌లోని మే ఫెయిర్ హాలులో జరిగిన ఓ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్(ఐవోడీ) ప్రతినిధుల చేతుల మీదుగా ఈ అవార్డులు అందుకున్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ హోదాలో డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్ 2025 అవార్డును నారా భువనేశ్వరికి ఐవోడీ ప్రతినిధులు అందజేశారు. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ హోదాలో ప్రజాసేవ -సామాజిక సాధికారత రంగాల్లో చేసిన విశేష కృషికి గానూ నారా భువనేశ్వరికి ఈ అవార్డును అందజేశారు. అలాగే హెరిటేజ్ ఫుడ్స్ సంస్థకు 'ఎక్సలెన్స్ ఇన్ కార్పొరేట్ గవర్నెన్స్' విభాగంలో లభించిన గోల్డెన్ పీకాక్ అవార్డునూ ఇదే వేదికపై నారా భువనేశ్వరికి నిర్వాహకులు అందజేశారు. నారా భువనేశ్వరి అంతర్జాతీయ అవార్డులు అందుకోవడం పట్ల నందమూరి బాలకృష్ణ హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు భువనేశ్వరి దూరదృష్టి, కృషి, సేవాభావానికి నిదర్శనమని కొనియాడారు. భువనేశ్వరి విలువలు, సేవాస్ఫూర్తి మనందరికీ ఆదర్శం, ప్రేరణ అని అన్నారు.

## కార్లు-బుల్డోజర్ మధ్యే జూబ్లీహిల్స్ యుద్ధం
# కాంగ్రెస్ గెలిస్తే ఎవరి రక్షణ? - కేటీఆర్




జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ గెలిస్తే ఇళ్లు కూడా బుల్డోజర్‌కు గురవుతాయని, ప్రజలను ఎవరు రక్షించరని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. సోమాజీగూడలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన కాంగ్రెస్ సర్కారు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని క్షతపరుస్తూ విమర్శించారు.కేటీఆర్ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం రేవంత్ పూర్తిగా నిలబెట్టలేదని, విద్యార్థులకు హామీ ఇచ్చిన విద్యా భరోసా కార్డు కూడా అందించలేదని గుర్తుచేశారు. ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, అగ్రవర్ణాల పేద విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వనోడు అభివృద్ధి చేయగలడా అని ప్రశ్నించారు.ఉద్యోగుల విషయానికి వస్తే, కొత్త పీఆర్సీ, డీఏ హామీలు మాత్రమే ఇచ్చి అమెళ్లు పెట్టలేదని, రిటైర్డ్ ఉద్యోగుల బెనిఫిట్స్ రెండేళ్లుగా అందించని పరిస్థితిని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలకు గురయ్యారని, విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారని, గిరీబోళ్ల ఇళ్లు కూల్చి ఎవరు నిలబడరని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కేటీఆర్ జూబ్లీహిల్స్ ఉపఎన్నికను "కారు-బుల్డోజర్ మధ్య యుద్ధం" అని వివరిస్తూ, కాంగ్రెస్ గెలిస్తే ప్రతి ఇంటికీ నీటి బిల్లులు వస్తాయని, అందులో ప్రజల అభివృద్ధి నిలబడదని హెచ్చరించారు. బీఆర్ఎస్ పది సంవత్సరాల అభివృద్ధి, కాంగ్రెస్ రెండేళ్ల అరాచకాన్ని గుర్తుచేసుకుని, ఓటర్లు సునీతా గోపినాథ్‌కి భారీ మెజారిటీ ఇవ్వాలని కోరారు.

## పంచాయతీ సెక్రటరీ పేరు, కేడర్‌లో మార్పు
# ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ పంచాయతీ కార్యదర్శి పోస్టులను గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జీపీడీవో) గా మార్చింది.. అలాగే గ్రామ పంచాయతీ కార్యదర్శులు తీసుకునే వేతనాల్లో ఎలాంటి మార్పులు చేయకుండా, ప్రస్తుతం ఉన్న ఐదు కేడర్‌లను నాలుగు కేడర్‌లకు కుదించింది. జనాభా, వార్షికాదాయం ప్రాతిపదికన రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలను కొత్తగా వర్గీకరిస్తూ గత నెల 10వ తేదీన ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకు సంబంధించిన అంశాలతో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మంగళవారం జీవో జారీ చేశారు. దీని ప్రకారం ఇప్పటివరకు అమలులో ఉన్న 7244 క్లస్టర్ గ్రామ పంచాయతీల స్థానంలో 13,351 గ్రామ పంచాయతీలు పనిచేయనున్నాయి. వీటిని 359 అర్బన్ పంచాయతీలు, 3082 గ్రేడ్ 1 పంచాయతీలు, 3163 గ్రేడ్ 2 పంచాయతీలు, 6747 గ్రేడ్ 3 పంచాయతీలుగా వర్గీకరించారు. వీటికి సంబంధించి సమగ్ర వివరాలతో ప్రత్యేక ఆదేశాలను ఇస్తామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా..
# హైదరాబాదీ మహిళ గజాలా హాష్మీ

అమెరికాలో పలు పదవులకు జరిగిన ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి గట్టి షాక్ తగిలింది. ఈ ఎన్నికల్లో డెమోక్రాట్లు తమ సత్తా చాటారు. యూఎస్ ఆర్థిక రాజధాని న్యూయార్క్ నగర మేయర్‌గా భారత సంతతికి చెందిన జోహ్రాన్ మమ్దానీ విజయం సాధించిన విషయం తెలిసిందే. ఇక వర్జీనియాలో జరిగిన ఎల్జీ ఎన్నికల్లో మరో భారత సంతతికి చెందిన మహిళ సత్తా చాటారు. వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా భారత సంతతికి చెందిన డెమోక్రటిక్ అభ్యర్థిని గజాలా హాష్మీ విజయం సాధించారు. రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి జాన్ రీడ్‌పై భారీ మెజారిటీతో గెలుపొందారు. హాష్మీ 15వ సెనెటోరియల్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వర్జీనియా సెనేట్‌లో పనిచేసిన మొదటి ముస్లిం, తొలి దక్షిణాసియా అమెరికన్ గజాలా. ఈమె




భారత సంతతికి చెందిన మహిళే కాదు.. హైదరాబాద్ వాసి కూడా. హైదరాబాద్‌లో పుట్టి.. గజాలా హాష్మీ.. 1964లో హైదరాబాద్‌లో జియా హాష్మీ, తన్వీర్ హాష్మీ దంపతులకు జన్మించారు. తన బాల్యాన్ని మల్‌పేట్‌లోని తన అమ్మమ్మ ఇంట్లో గడిపారు. నాలుగేళ్ల వయసులో తన తల్లి, సోదరుడితో కలిసి గజాలా అమెరికాలోని జార్జియాకు వలస వెళ్లారు.



## యూపీలో ఘోర ప్రమాదం.. పట్టాలు దాటుతున్న
# యాత్రికులను ఢీకొన్న రైలు

ఉత్తరప్రదేశ్‌లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. పట్టాలు దాటుతున్న యాత్రికులను రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. మీర్జాపూర్ లోని చునార్ జంక్షన్‌లో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. చోపన్ — ప్రయాగ్‌రాజ్ ఎక్స్‌ప్రెస్ చునార్ స్టేషన్ ప్లాట్‌ఫామ్ 4 వద్ద వచ్చి ఆగింది. అందులో నుంచి ప్రయాణికులు దిగి.. ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ కాకుండా పట్టాలు దాటేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న నేతాజీ ఎక్స్‌ప్రెస్ వారిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. అప్రమత్తమైన రైల్వే సిబ్బంది వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.